క్లుప్తంగా

దరఖాస్తు చేసుకోండి

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో 2025–26 విద్యాసంవత్సరానికి గాను స్పాట్ అడ్మిషన్లకు అర్హులైన విద్యార్థులు వెంటనే ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వీర ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. అడ్మిషన్లు చేసుకున్న విద్యార్థులు ఈనెల 15, 16ల్లో తగిన ధ్రువపత్రాలతో కళాశాలలో హాజరు కావాలన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో స్వీపర్ కమ్ స్కావెంజర్‌గా పని చేయడానికి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో గంగారాం తెలిపారు. మండల వాసులై ఉండి 18 నుంచి 45 ఏళ్ల మధ్య ఉన్న మహిళలు, ఏడోతరగతి ఉతీర్ణత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వేములవాడఅర్బన్: పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో 2025–26 విద్యాసంవత్సరానికి మిగిలిన ఎస్సీ సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్లు ఈనెల 15, 16, 18, 19ల్లో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.లావణ్య ప్రకటనలో తెలిపారు.

గంభీరావుపేటలో గ్రామసభ

గంభీరావుపేట: గంభీరావుపేట మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. గ్రామసభకు రెండు, మూడు శాఖల అధికారులే ఎక్కువగా హాజరయ్యారు. ప్రజల నుంచి స్పందన అంతగా కనిపించలేదు. గ్రామ పంచాయతీ కార్యాలయం గ్రామానికి కొంత దూరంగా ఉండడం.. గ్రామసభ నిర్వహణపై ప్రచారం అనుకున్న స్థాయిలో లేకపోవడం.. రైతులు యూరియా బస్తాల కోసం గోదాముల వద్ద బారులు తీరడంతో గ్రామసభలో జనం అంతగా కనిపించలేదు. అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది హాజరయ్యారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతులేమిపై అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీడీవో రాజేందర్, పంచాయతీ కార్యదర్శి వినీల్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళల రక్షణకే షీ టీమ్స్



పెద్దలింగాపురం హైస్కూల్‌లో అవగాహన కల్పిస్తున్న సభ్యులు

ఇల్లంతకుంట: మహిళలు ఎక్కడైనా వేధింపులకు గురైతే వెంటనే షీ టీమ్స్‌ను సంప్రదించాలని షీ టీం సభ్యులు సూచించారు. పెద్దలింగాపురం, అనంతారం, వల్లంపట్ల, కందికట్కూర్ హైస్కూళ్లలో శుక్రవారం షీ టీం బృందం పర్యటించి విద్యార్థులతో మాట్లాడారు. షీ టీం ఏఎస్ఐ ప్రమీల, వీరయ్య, సిబ్బంది శ్రీనివాస్, శ్రీలత, ప్రియాంక, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు

చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

ఎల్లారెడ్డిపేట: చిరు ధాన్యాలను ఉపయోగించుకొని ప్రజలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని మాజీ సర్పంచ్ ముక్క శంకర్ అన్నారు. రాజన్నపేటకు చెందిన ఇందిరా మహిళా శక్తి మహిళలు శుక్రవారం చిరు ధాన్యాలపై ప్రదర్శన నిర్వహించారు.

బీజేపీ వర్క్‌షాప్

రుద్రంగి: మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో సేవాపక్షం మండల కార్యశాల నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ కార్యాచరణ, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలపై చర్చించారు. మండల ప్రధాన కార్యదర్శి మల్యాల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గండి శ్రీనివాస్, ట్రెజరర్ తాళ్లపెల్లి బాలకృష్ణరావు, ప్రధాన కార్యదర్శి దర్శనం లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

25వ రోజుకు మహా పాదయాత్ర

ముస్తాబాద్: శబరిమల అయ్యప్పస్వామి దర్శనానికి స్వాములు చేపట్టిన మహా పాదయాత్ర అనంతపురం జిల్లా పెనుగొండకు శుక్రవారం చేరుకుంది. ముస్తాబాద్‌కు చెందిన రాజు గురుస్వామి ఆధ్వర్యంలో 36 మంది స్వాములు శబరిమలకు పాదయాత్ర చేపట్టారు. 25వ రోజు పెనుగొండలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన రేవన్న, తిమ్మప్ప, మంజు, సతీశ్, సదాశివ, హన్మంత్‌రావు, జితేందర్ మిత్ర బృందం యాత్రకు రూ.51వేల విరాళమందించారు.

ముస్లింల ర్యాలీ



ఇల్లంతకుంట: మండల కేంద్రంలో శుక్రవారం నమాజ్ అనంతరం ముస్లింలు మసీదు నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎండీ నయీమ్, అజీమ్, షేక్ బాబా, ఖలీల్, సమీర్, ఫైజాన్, అబిద్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ తీశారు. మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. డాక్టర్ హైమద్, రంజాన్, బాబా, ముస్తాక్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

కంపు కొడుతున్న శివారు ప్రాంతాలు



ముస్తాబాద్-మొర్రాయిపల్లె రహదారి పక్కన చెత్త కుప్ప



కేసీఆర్‌కాలనీలో చెత్త

- మేజర్ పంచాయతీలో చెత్త సమస్య
- రహదారుల వెంట వేస్తున్న వైనం

ముస్తాబాద్: పట్టణ శివారు ప్రాంతాలు కంపు కొడుతున్నాయి. రోజురోజుకు పెరుగుతున్న పట్టణానికనుగుణంగా పారిశుధ్య చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రాంగం ఇబ్బంది పడుతున్నారు. ముస్తాబాద్ మేజర్ పంచాయతీలో 2 ట్రాక్టర్లు, 4 ఈటోలు చెత్త సేకరణకు వినియోగిస్తున్నా.. ఇంకా పలు కాలనీల్లో చెత్త దర్శనమిస్తోంది. ఒకవైపు పంచాయతీ పారిశుధ్య సిబ్బంది చెత్తను సేకరించిన గంటల వ్యవధిలోనే ప్రజలు బాధ్యతరహితంగా చెత్తను రహదారుల వెంట పారవేయడం పరిపాటిగా మారింది. అయితే వానాకాలం కావడంతో చెత్త మురిగిపోయి దుర్గంధం వెదజల్లుతోంది.

ఇలా తీయడంతోనే అలా వేస్తున్నారు

ముస్తాబాద్ మేజర్ పంచాయతీలో 2,500కు పైగా గృహాలున్నాయి. పది వేలకు పైగా జనాభా ఉంది. పంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్లు 32 మంది ఉన్నారు. ప్రధాన రహదారులతోపాటు కాలనీల్లో చెత్తను ట్రాక్టర్లు, ఆటోల్లో సేకరిస్తూ దంపు యార్డుల్లో వేస్తున్నారు. అయితే ప్రధాన రహదారులతోపాటు శివారు ప్రాంత రహదారుల వెంట చెత్త తీసిన కొద్ది గంటల్లోనే చెత్తను పారేస్తున్నారు. పంచాయతీ అధికారులు చెత్త వేయొద్దని జరిమానా విధిస్తున్నారు. పలు ప్రాంతాల్లో చెత్త వేయొద్దని బోర్డులు పెడుతున్నారు.

బాధ్యతారాహిత్యం..

ముస్తాబాద్‌లో కొంతమంది బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. తమ ఇంట్లోని చెత్తను బయట వేస్తున్నామన్న స్పృహ మినహా ఎక్కడ వేస్తున్నామనే ఆలోచన లేకుండా వేస్తున్నారు. పంచాయతీ సిబ్బంది ట్రాక్టర్లతో ఇంటి ముందుకు వచ్చినా చెత్త ఇవ్వకుండా బద్ధకించే వారు కొంతమంది ఉన్నారు. ముఖ్యంగా ముస్తాబాద్-పోతుగల్, ముస్తాబాద్-మొర్రాయిపల్లె, ముస్తాబాద్-దుబ్బాక, ముస్తాబాద్-సిద్దిపేట, ముస్తాబాద్-కామారెడ్డి ప్రధాన రహదారిపై పలుచోట్ల చెత్త వేస్తున్నారు. కోళ్ల వ్యర్థాలు వేయడం పరిపాటిగా మారింది. కేసీఆర్‌కాలనీ, ఇందిరమ్మకాలనీల్లో పారిశుధ్య చర్యలు సరిగా చేపట్టడం లేదు.

చర్యలు తీసుకోవాలి



ముస్తాబాద్ శివారు ప్రాంతాల్లో చెత్తను ప్రజలు ఇష్టారాజ్యంగా పారేస్తున్నారు. బైక్‌లపై వచ్చి మరీ చెత్త పారేస్తున్నారు. పలు కాలనీల్లో పారిశుధ్య లోపం ఉంది. చెత్తతో దుర్వాసన వెదజల్లి అనారోగ్యానికి గురవుతున్నాం. ఎస్సీకాలనీ వద్ద రోడ్లపై చెత్త వేస్తున్నారు. మొర్రాయిపల్లె రోడ్డు ఘోరంగా మారింది. అధికారులు చర్యలు చేపట్టాలి.

– చింతోజు బాలయ్య, ముస్తాబాద్

ప్రజలు సహకరించాలి



మేజర్ పంచాయతీలో పారిశుధ్య చర్యలు రోజూ చేపడుతున్నాం. శివారు కాలనీలు, రహదారుల వెంట ఇష్టారాజ్యంగా ప్రజలు చెత్త వేస్తున్నారు. సిబ్బంది వెళ్లి తొలగించిన గంటల్లోనే తిరిగి చెత్త వేస్తున్నారు. గతంలో బోర్డులు పెట్టి జరిమానా విధించాం. ఇకనుంచి భారీ జరిమానా విధిస్తాం. ప్రజలు సహకరిస్తేనే సంపూర్ణ పారిశుధ్యం సాధిస్తాం.

– రమేశ్, ఈవో, ముస్తాబాద్

ఫొటో ఎక్స్‌పో విజయవంతం చేయాలి



బోయినపల్లిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఫొటోగ్రాఫర్లు

బోయినపల్లి: మండల ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఈనెల 19, 20, 21ల్లో జరగనున్న ఫొటో ఎక్స్‌పోకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం బోయినపల్లిలో ఆవిష్కరించారు. ఫొటోగ్రాఫర్లు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని అధ్యక్షుడు వేముల చిరంజీవి కోరారు. దూస రాజశేఖర్, మహమ్మద్ షాదుల్, దుంపటి శ్రీను, బిల్లా రవీందర్, బొజ్జ వెంకటేశ్, దూస రాకేశ్, కత్తెరపాక వేణు, అల్వాల రాము తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: ఈనెల 19 నుంచి 21 వరకు హైదరాబాద్‌లో నిర్వహించే ట్రేడ్ ఎక్స్‌పో కార్యక్రమ పోస్టర్‌ను మండల ఫొటోగ్రాఫర్లు ఆవిష్కరించారు. గూడ బాబు, మతం వెంకటేశం, తిరుపతి, రేగుల కిష్ట, మామిడి కమలాకర్, ఎంద్ర రాజు, శ్రీనివాస్, రాజేశ్ కన్నా తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయంలో చోరీ



కోనరావుపేట: పల్లిమక్తలోని దుర్గమ్మ ఆలయంలో దొంగతనం జరిగింది. గ్రామంలో ఆలయాన్ని నూతనంగా నిర్మించి ఉత్సవాలు జరిపించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన పెద్ద గంటను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. కోనరావుపేట పోలీసులకు నిర్వాహకులు ఫిర్యాదు చేశారు.

సైకిళ్లు పంపిణీ



సైకిళ్లు అందిస్తున్న గోపి, నాయకులు

గంభీరావుపేట: గజసింగవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న 30 మంది విద్యార్థులకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి శుక్రవారం సైకిళ్లు పంపిణీ చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ తన పుట్టినరోజును పురస్కరించుకొని విద్యార్థులకు మోదీ కానుకగా సైకిళ్లు అందిస్తున్నారన్నారు. కోడె రమేశ్, గంట అశోక్, క్రాంతికుమార్, విఘ్నేశ్‌గౌడ్, మల్లేశ్‌యాదవ్, సత్యనారాయణ, రాజిరెడ్డి, సర్వోత్తం, నాగరాజుగౌడ్, ఎలేందర్, రవీందర్, ఎంఈవో గంగారాం, హెచ్‌ఎం సమ్మయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చదువుతోపాటు ఆటలూ ముఖ్యం

రుద్రంగి: మానసికోల్లాసం, శారీరక దారుఢ్యానికి చదువుతోపాటు ఆటలు కూడా అవసరమని ఏఎంసీ చైర్మన్ చెలుకల తిరుపతి అన్నారు. శుక్రవారం రుద్రంగి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండలస్థాయి క్రీడాకారుల ఎంపిక ఆటల పోటీల ప్రారంభ కార్యక్రమానికి హాజరయ్యారు. మండల విద్యాధికారి నల్లపురి రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రతిభావంతులైన క్రీడాకారులను ఎంపిక చేసి పేరు తేవాలని వ్యాయామ ఉపాధ్యాయులకు సూచించారు. సెస్ డైరెక్టర్ ఆకుల గంగారం మాట్లాడుతూ.. ఓటమి చెందినవారు మరింత పట్టుదలతో కృషి చేస్తే విజయం సాధిస్తారని అన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్‌లో బాలబాలికలకు జూనియర్, సీనియర్ విభాగాల్లో క్రీడాపోటీలు నిర్వహించి ఎంపిక చేశారు. రుద్రంగి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కామిడి సమ్మిరెడ్డి, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు హనుమంతు, గౌతమి, కవిత, విజయ్‌చందర్, అనిల్ పాల్గొన్నారు.

యూరియా అందించే బాధ్యత కేంద్రానిదే..



రైతులకు గేదెలు అందిస్తున్న మహేందర్‌రెడ్డి, అధికారులు

ముస్తాబాద్: రైతులందరికీ సరిపడా యూరియా ఎరువులను అందించే బాధ్యత కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానిదేనని కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. నామాపూర్‌లో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పాడి రైతులకు రూ.12లక్షల విలువ చేసే గేదెలను శుక్రవారం పంపిణీ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, డీడబ్ల్యూవో లక్ష్మీరాజం, పశుసంవర్ధక శాఖ ఏడీ రవీందర్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, మండల ప్రత్యేకాధికారి లత, పశు వైద్యాధికారి నిఖిల తదితరులు పాల్గొన్నారు.

హిందీ భాషా దినోత్సవం



విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

వేములవాడరూరల్: చెక్కపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల హిందీ భాషా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. హెచ్‌ఎం లోకిని కిషన్, శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. హిందీ టీచర్ రేపాక రవి హిందీ భాష ప్రాముఖ్యం, ఆవశ్యకత వివరించారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ హిందీ భాషా సంబంధిత నమూనాలు ప్రదర్శించారు.

జాతీయ సహకార సమావేశానికి 'కొండూరి'



రవీందర్‌రావుకు స్వాగతం పలుకుతున్న హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర సంఘం ప్రతినిధులు

గంభీరావుపేట: సహకార పునర్జీవం, సమష్టి సహకార బలం ద్వారా దేశ భవిష్యత్‌ను రూపొందించడం అనే అంశాలపై సిమ్లాలో శనివారం జరగనున్న జాతీయ సహకార సమావేశానికి నాఫ్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు హాజరవుతున్నారు. శుక్రవారం సిమ్లా ఎయిర్‌పోర్ట్‌లో హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంక్ అధికారులు, కార్యక్రమ నిర్వహణ ప్రతినిధులు రవీందర్‌రావుకు పుష్పగుచ్ఛమిచ్చి స్వాగతం పలికారు.

పాఠశాలను ఉన్నతంగా తీర్చిదిద్దారు



మాట్లాడుతున్న ఎంఈవో

ఇల్లంతకుంట: కందికట్కూర్ హరిజనవాడ ప్రాథమిక పాఠశాలను ప్రధానోపాధ్యాయుడు బి.రవీందర్‌రెడ్డి ఉన్నతంగా తీర్చిదిద్దారని మండల విద్యాధికారి చెప్యాల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కందికట్కూర్ గ్రామ హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పాఠశాలను గ్రామస్తుల సహకారంతో రైలు బడి థీమ్ మాదిరిగా ఏర్పాటు చేసి పాఠశాలను సర్వతోముఖాభివృద్ధి చేశారని పేర్కొన్నారు. రవీందర్‌రెడ్డిని సన్మానించారు. ఉపాధ్యాయుడు రాజు, గ్రామస్తులు మల్లికార్జున్, అశోక్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశం



గాలిపెల్లి హైస్కూల్లో సమావేశం

ఇల్లంతకుంట: మండల విద్యాధికారి కార్యాలయంలో సాంఘిక శాస్త్రం, గాలిపెల్లి హైస్కూల్లో బయాలజీ, విషయ స్కూల్ అసిస్టెంట్ టీచర్లకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. బోయిన్‌పల్లి, తంగళ్లపల్లి, ఇల్లంతకుంట మండలాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులకు సబ్జెక్టుకు సంబంధించిన మెలకువలు వివరించారు. ఆర్పీలు కొమ్మెర రాజ్‌కుమార్, రమేశ్, మహేశ్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు విద్యుత్ స్టార్టర్, తీగలు ధ్వంసం

చందుర్తి: పిడుగుపాటుతో వ్యవసాయ విద్యుత్ స్టార్టర్, తీగలు గురువారం రాత్రి ధ్వంసమయ్యాయని బండపల్లి గ్రామానికి చెందిన నడిపి లక్ష్మారెడ్డి అనే రైతు తెలిపారు. రూ.25వేలకు పైగా నష్టం వాటిల్లిందని, పరిహారమందించి ఆదుకోవాలని రైతులు కోరారు.

కంటి శిబిరానికి స్పందన

వేములవాడరూరల్: లింగంపల్లి గ్రామంలో శుక్రవారం రేకుర్తి కంటి దవాఖాన ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. వేములవాడ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నర్సయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరానికి స్పందన వచ్చింది.

క్షీరాభిషేకం

రుద్రంగి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన మరమ్మతుకు రూ.36.90లక్షలు, కేజీబీవీకి రూ.8లక్షలు మంజూరు చేసినందుకు గాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు విద్యార్థులు, కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు.

పొగాకుతోనే క్షయ వ్యాధి

ఎల్లారెడ్డిపేట: పొగాకు తీసుకునేవారు ఎక్కువగా క్షయ వ్యాధికి గురవుతారని మండల వైద్యాధికారిణి సారియా అంజుమ్, టీబీ సూపర్‌వైజర్ మహిపాల్ అన్నారు. ఎల్లారెడ్డిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా టీబీపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సూపర్‌వైజర్లు పద్మ, రేవతి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వం మహిళలు ఎదుర్కొంటున్న పింఛన్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జి పుట్ట రవి, జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్ అన్నారు. వెంకటాపూర్‌లోని డబుల్ బెడ్‌రూం కాలనీలో శుక్రవారం పింఛన్‌దారులతో సమావేశం నిర్వహించారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ శోభారాణి, అందే శామ్యూల్ పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి నివాళి



సిరిసిల్లలో నివాళి అర్పిస్తున్న నాయకులు

సిరిసిల్ల అర్బన్: దేశ రాజకీయాల్లో కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు యోధుల్లో ఒకరైన సీతారాం ఏచూరి ఉద్యమాలకు దిక్సూచిగా నిలబడిన మేధావని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేశ్ అన్నారు. శుక్రవారం సిరిసిల్లలోని అమృత్‌లాల్ శుక్ల కార్మిక భవనంలో సీపీఎం నాయకుడు సీతారాం ఏచూరి వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ, రమేశ్‌చంద్ర, నక్క దేవదాస్, పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

విద్య, ఉపాధి అవకాశాలకు అనేక ఉద్యమాలు చేసిన గొప్ప వ్యక్తి సీతారాం ఏచూరి అని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ అన్నారు. శుక్రవారం సిరిసిల్లలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కదారి శివ, ముబారక్, సాయి, రషీద్, జశ్వంత్, నవీన్, నయీం, సాయిభరత్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిరెడ్డి పోరాట స్ఫూర్తితో ముందుకు..

చందుర్తి: స్వాతంత్ర్య సమరయోధుడు కామ్రేడ్ గడ్డం తిరుపతిరెడ్డి పోరాట స్ఫూర్తితో ముందుకు సాగుతామని సీపీఐ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి కదారి రాములు అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా బండపల్లిలో కామ్రేడ్ తిరుపతిరెడ్డి స్తూపం వద్ద నివాళి అర్పించారు. అనసూర్య, కోరేపు క్రాంతి, పెంట రాజేశం తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు పరిశీలన



ఇంటి నిర్మాణం పరిశీలిస్తున్న ఎంపీడీవో

తంగళ్లపల్లి: జిల్లెల్ల గ్రామంలో శుక్రవారం ఎంపీడీవో లక్ష్మీనారాయణ పర్యటించారు. ఇందిరమ్మ ఇళ్ల పురోగతి, జిల్లెల్ల ప్రభుత్వ పాఠశాల, నూతనంగా నిర్మిస్తున్న అంగన్వాడీ, వంట గదిని పరిశీలించారు. ఏఎంసీ డైరెక్టర్ ఇట్టిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు ఆసరి బలరాజ్‌యాదవ్, కందుకూరి మనోజ్‌కుమార్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి రాజు, కారోబార్ కిషన్, ఫీల్డ్ అసిస్టెంట్ భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి నేతల అరెస్టు సిగ్గుచేటు



మాట్లాడుతున్న రవిగౌడ్

సిరిసిల్లటౌన్: హైకోర్టు తీర్పును అమలు చేయాలని కోరుతూ నిరసన తెలిపిన విద్యార్థి నేతలను సర్కారు అక్రమంగా అరెస్టు చేయించడం సిగ్గుచేటని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో నిర్వహించిన గ్రూప్–1 పరీక్షలను హైకోర్టు తీర్పు ప్రకారం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు ఎస్కే అఫ్రోజ్, కోడం వెంకటేశ్, వేముల శ్రీకాంత్, మాలోత్ రాకేశ్‌నాయక్, లింగంపల్లి అభి, అందె సుదర్శన్, శ్రీకాంత్, హరీశ్, జగన్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీపూర్‌లో ఎన్ఎస్ఎస్ క్యాంపు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జయ

తంగళ్లపల్లి: లక్ష్మీపూర్ గ్రామంలో శుక్రవారం తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ క్యాంపు ప్రారంభించారు. ప్రిన్సిపాల్ జయ మాట్లాడుతూ.. గ్రామంలో 7 రోజులపాటు ప్రత్యేక ఎన్ఎస్ఎస్ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ రెహానా, ప్రోగ్రామ్ ఆఫీసర్ వాణిశ్రీ, ప్రత్యేక అధికారి సాగర్, కార్యదర్శి గీత, హెచ్ఎం రాజేశ్వరి, ఏఎంసీ డైరెక్టర్ అరెపల్లి బాలు, అధ్యాపకులు నవ్యశ్రీ, లావణ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆది శ్రీనివాస్

కోనరావుపేట: కోనరావుపేట సింగిల్‌విండో చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ బండ నర్సయ్య.. వట్టిమల్ల మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ దర్శనాల శంకరయ్య తదితరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. విప్ ఆది శ్రీనివాస్ వారికి కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. బండ నర్సయ్య మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి, విప్ నాయకత్వంలో రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నచ్చి కాంగ్రెస్‌లో చేరామన్నారు.

నమ్ముకున్న నాయకులకు మంచి రోజులు



మాట్లాడుతున్న నాయకులు

కోనరావుపేట: బీఆర్ఎస్ పార్టీని నమ్ముకున్న వారికి త్వరలో మంచి భవిష్యత్తుంటుందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య అన్నారు. కోనరావుపేటలో మాట్లాడుతూ.. 2001లో పార్టీ నుంచి జెడ్పీటీసీగా గెలుపొంది ఈరోజు తన సొంత లాభం కోసం పార్టీ మారిన బండ నర్సయ్య వెళ్లిపోవడాన్ని పీడ వదిలిందని భావిస్తున్నామన్నారు. సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, పొన్నం పర్శరాములు, కొమ్ము ఎల్లయ్య, సిద్దంశెట్టి శ్రీనివాస్, ప్రతాపరెడ్డి, మాజీ సర్పంచులు గోపు పర్శయ్య, మాలోత్ సూర్యానాయక్, నాయకులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన రవాణా సిబ్బంది



మొక్క నాటుతున్న అధికారులు

తంగళ్లపల్లి: జిల్లా రవాణా శాఖ అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం వన మహోత్సవం నిర్వహించారు. జిల్లా అధికారి లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించే స్థలంలో 200 మొక్కలు నాటామన్నారు. ఎంవీఐ వంశీధర్, ఏఎంవీఐ గ్రేగర్జాన్ రోనాల్డ్ ఎడ, దండుగుల మనోజ్‌కుమార్, కానిస్టేబుల్ ప్రశాంత్, హోమ్ గార్డ్ ఎల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బతుకమ్మ తెప్ప మరోచోట నిర్మించాలి

బోయినపల్లి: కొదురుపాకలో బతుకమ్మ తెప్పను నూతనంగా నిర్మిస్తున్న ఆలయం పక్కన కాకుండా ఎల్లమ్మ ఆలయం వెనకాల ఉన్న ఖాళీ స్థలంలో నిర్మించాలని గ్రామ మాజీ ఎంపీటీసీ బొల్లవేణి భానుశ్రీ కోరారు. బతుకమ్మ తెప్ప నిర్మాణంపై కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. ఇళ్ల మధ్యలో నిర్మించడం సరికాదన్నారు.

సేవా కార్యక్రమాలు నిర్వహించాలి

వేములవాడరూరల్: మోదీ జన్మదినం సందర్భంగా సెప్టెంబర్ 17న సేవా కార్యక్రమాలు నిర్వహించాలని వేములవాడ రూరల్ సేవా కార్యక్రమాల ఇన్‌చార్జి, కోనరావుపేట మాజీ జెడ్పీటీసీ పల్లం అన్నపూర్ణ అన్నారు. వేములవాడ రూరల్ పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరయ్యారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బండ మల్లేశంయాదవ్, రూరల్ అధ్యక్షుడు పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ మోడల్ హౌస్‌లో సమావేశం

వీర్నపల్లి: మండల కేంద్రంలోని ఇందిరమ్మ మోడల్ హౌస్‌లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వానికి సంబంధించిన ఇందిరమ్మ మోడల్ హౌస్‌లో రాజకీయ పార్టీ సమావేశాలు నిర్వహించడంపై స్థానికులు చర్చించుకుంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై హౌసింగ్ ఏఈ చైతన్యను వివరణ కోరగా.. మోడల్ హౌస్‌కు సంబంధించిన తాళాలు తన దగ్గరే ఉన్నాయని, తన అనుమతి లేకుండానే ఈ సమావేశం నిర్వహించారని తెలిపారు.